కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి



పేరు: జీవీ. వెన్నెల
పుట్టిన తేదీ: 4జూన్ 1980
తల్లిదండ్రులు : విమల, గద్దర్
విద్యార్హత: మహిళ సాధికార తపై పీహెచ్‌డీ పూర్తి చేశారు.
ప్రాథమిక విద్య : సెయింట్ ఆన్స్ బొల్లారం
మాధ్యమిక విద్య: శ్రీ విద్యానికేతన్ జూనియర్ కాలేజీ తిరుపతి
డిగ్రీ: బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్స్ అప్లికేషన్స్, దీవాన్ బహదూర్ కాలేజ్, సికింద్రాబాద్

- గతేడాది ఇగ్నో నుంచి పీజీ డిప్లొమా ఇన్ స్కూల్ లీడర్ షిప్ అండ్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు.
- 2012 నుంచి అల్వాల్ లోని మహాబోధి విద్యాలయ కరస్పాండెంట్‌గా కొనసాగుతున్నారు.
- 2007–2011 వరకు మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేశారు.

నివాసం: ప్లాట్ నెంబర్ 26 భూదేవినగర్, అల్వాల్.

క్లుప్తంగా...

దూరవిద్యలో ఏడు వేల మంది ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూర విద్య కోర్సుల్లో ఏడువేల మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి తెలిపారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఈ నెల 20తో ముగిసిన మొదటి విడత అడ్మిషన్లలో 7 వేల మంది విద్యార్థులు ప్రవేశం పొందారని రెండో విడత ప్రవేశాలు 2024 జనవరిలో ప్రారంభం అవుతాయన్నారు.

బీసీ సీఎం ప్రకటనపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేతను ముఖ్యమంత్రి చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా సూర్యాపేట సభలో ప్రకటించడం పట్ల బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యం, న్యాయం అందరికి అందిస్తామని బీజేపీ నేతల ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కూడా బీసీలకు సీఎం అవకాశం ఇవ్వాలన్నారు.

శనివారం మధ్యాహ్నం నుంచి బల్కంపేట ఆలయం మూసివేత

అమీర్‌పేట: పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంను మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు.శనివారం రాత్రి గం 01.05 నిమిషాల నుంచి రాత్రి గం 02.20 వరకు చంద్ర గ్రహణం ఉన్నందున శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయం మూసి వేయబడుతుందన్నారు. ఆదివారం ఉదయం దేవాలయాన్ని శుద్ధిచేసి అభిషేక పూజల నిర్వహణ అనంతరం 7 గం నుంచి భక్తులకు అనుమతి ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు.

ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత

ముషీరాబాద్: నేటి యాంత్రిక యుగంలో ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ మహంకాళీ దేవాలయం వద్ద అమ్మవారి ఒడి బియ్యంతో ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా గోపాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

29న ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: డాక్టర్ ఆడుకియాస్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో ఈ నెల 29న (ఆదివారం) యశోద హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్డియాలజీ, ఆర్థోపెడిక్ వైద్య సేవలతో పాటు బీపీ, షుగర్, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డి ఎకో తదితర వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9967031943, 9063888014 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

అంబర్‌పేట్: నేడు తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు రూబీ స్టీవెన్ సన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చుకునే అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం ఎల్‌బీ నగర్ కామినేని ఆసుపత్రి సమీపంలోని ఎస్‌కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు.

ఉద్యోగ,ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ


కాచిగూడ: యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, జీవన నైపుణ్యం, బ్యూటీషియన్, టైలరింగ్, మెహిందీ తదితర కోర్సులలో 3 నెలల పాటు సికింద్రాబాద్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 8790361631 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఫలితాలను మలుపు తిప్పనున్న
మైనారిటీ ఓట్లు

లష్కర్‌లో 2.50 లక్షల ఓట్లకు 60 వేల వరకు ముస్లిం, క్రిష్టియన్ల ఓట్లు

- పోటాపోటీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారాలు
- అభ్యర్థిత్వం తేలక బీజేపీలో ఉత్కంఠ





సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతం భిన్న మతాలు, విభిన్న సంస్కృతులకు సమాహారంగా వర్ధిల్లుతోంది. ఇక్కడ దేశవ్యాప్తంగా ఉండే అన్ని మతాలు, వర్గాల ప్రజలు మొదలు ఆంగ్లో ఇండియన్స్ వరకు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఎక్కువ సంఖ్యలోని రైల్వే ఉద్యోగులు, వివిధ విభాగాల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాసాలు కలిపి మొత్తంగా సికింద్రాబాద్ ప్రాంతం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన ప్రాంతంగా ఖ్యాతి చెందింది. మొత్తం 2.50 లక్షల ఓటర్లు ఉండగా అందులో సుమారు 60 వేల వరకు ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీ ఓటర్లు ఉన్నారు. ప్రతీ ఎన్నికలో 40 వేల వరకు మైనారిటీల పోలింగ్ ఉంటుండడంతో వీరికి ప్రాధాన్యం పెరిగింది.

ఆ ఓట్లపై ప్రత్యేక గురి..

రెండు మైనారిటీ వర్గాల ఓట్లను రాబట్టుకునేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ ఇరువురు కూడా మైనారిటీల ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. మైనారిటీల ఓట్లు మొదటినుంచి తమకు అనుకూలంగా ఉన్నాయని అందుకే భారీ మెజారిటీతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందుతున్నారని పద్మారావుగౌడ్ చెబుతున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని మైనారిటీ వర్గాలకు తాను అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆయన ఈ మారు కూడా మైనారిటీల మద్దతుతో భారీ ఆధిక్యత చాటుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ హయాంలో ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీలకు న్యాయం జరగలేదని కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ ఆరోపిస్తున్నారు. మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మాత్రమే న్యాయం జరిగిందని తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మాత్రమే ఇక్కడి మైనారిటీలకు న్యాయం జరుగుతుందని ఆయన హామీలు గుప్పిస్తున్నారు. ఇరువురు అభ్యర్థులు మైనారిటీల ప్రాపకం పొందడం కోసం ఉదయం కాగానే ముస్లిం, క్రిష్టియన్ల ప్రాంతాల్లో ప్రత్యక్షమవుతున్నారు.





గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో..

గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మైనారిటీల మద్దతు ఫలితంగానే నియోజకవర్గంలోని మొత్తం మున్సిపల్ డివిజన్లను బీఆర్‌ఎస్ స్వీప్ చేసింది. అప్పటి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనం ఉన్న కారణంగా కాంగ్రెస్ పార్టీ నామమాత్రంగానే అభ్యర్థులను రంగంలోకి దింపింది. ఫలితంగా బీజేపీ అభ్యర్థులు బలమైన ప్రత్యర్థులుగా ఎదిగారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో ఒకటినుంచి మూడు వరకు బీజేపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలిచారు. సికింద్రాబాద్‌లో మాత్రం కేవలం మైనారిటీల అండ ఫలితంగా ఐదుకు ఐదు స్థానాలను బీఆర్‌ఎస్ అభ్యర్థులు చేజిక్కించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ కూడా బలమైన పోటీ ఇస్తున్న క్రమంలో మైనారిటీల మద్దతు ఎవరికో వేచి చూడాల్సిందే.



విభిన్న వర్గాల సమాహారం..

ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీలతో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గంలో వివిధ మతాలు, విభిన్న సంస్కృతులకు చెందిన ప్రజలు చెప్పుకోదగిన స్థాయిలో నివసిస్తుండడం గమనార్హం. సిక్కులు, జైనుల కుటుంబాలు తరతరాలుగా ఇక్కడే స్థిరపడ్డారు. ఉన్నారు. ఇదే నియోజకవర్గంలో దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయాలు, రైల్వే కాలనీలు ఉంటుండడంతో రైల్వే కుటుంబాలకు చెందిన ఓటర్ల సంఖ్య కూడా అధికంగానే ఉన్నాయి. పలు రైల్వే కాలనీలు నియోజకవర్గంలో ఉన్నాయి. రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల ఓట్లు మొత్తంగా 20 వేల వరకు ఉండటం గమనార్హం. రైల్వే యూనియన్లకు చెందిన పలువురు కార్మిక సంఘం నేతలు కూడా ఇక్కడి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండడం గమనార్హం.

ప్రజా సంక్షేమానికి శ్రమించా .. మరో అవకాశం ఇవ్వండి


మాణికేశ్వర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న పద్మారావు గౌడ్

లాలాపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లో శుక్రవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లతో కలిసి పాదయాత్రగా వెళ్తూ బస్తీలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. స్థానికులు పద్మారావుగౌడ్‌కు హారతులిస్తూ పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించామని, మరో అవకాశం కల్పించాలన్నారు. మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలన్న స్థానికుల అభిమతాన్ని తాము గౌరవించామన్నారు. హాస్పిటల్ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి అనుమతి పొందామని స్థలంసేకరణ, నిధుల మంజూరు ప్రక్రియ పూర్తయితే వెంటనే ఆసుపత్రి నిర్మాణం చేస్తామని స్పష్టం చేశారు. హాస్పిటల్ నిర్మాణ విషయాన్ని వివాదం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, ఆలకుంట హరి, వరికుప్పల రవి, ఓర్సు శేఖర్, జింకల మల్లేష్ పాల్గొన్నారు.

గోబ్యాక్ అంటూ ప్లకార్డులతో నిరసన..

పద్మారావు ఎన్నికల ప్రచారానికి రాక ముందే రెండు గంటల పాటు మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో బస్తీ వాసులంతా నిరసన తెలిపారు. గతంలో హాస్పిటల్ నిర్మాణం కోసం 126 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టామని ఆ సమయంలో హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని పద్మారావు గౌడ్ ఇచ్చిన హామీని నెరవేర్చకుండా తమ బస్తీలోకి ఎన్నికల ప్రచారానికి రావద్దంటూ గో బ్యాక్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో బస్తీ వాసులు, బీఆర్‌ఎస్ శ్రేణులకు వాగ్వాదం జరిగింది. మాణికేశ్వర్‌నగర్‌కు వచ్చిన పద్మారావు గౌడ్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు ఎన్నికల తరువాత ఆసుపత్రి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. నిరసనలో వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య,, గండికోట విజయ్‌కుమార్, అయ్యప్పరెడ్డి, గండికోట నర్సింహా, వేణు పాల్గొన్నారు.


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

చిలకలగూడ : ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి కమ్యూనిటీహాల్లో ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు నేతృత్వంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలని, ఆటో డ్రైవర్ల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, తదితర ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు నిరసన, ఆందోళనలు చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఓలా, ఉబర్ వంటి సంస్థలకు వత్తాసు పలికిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పార్శిగుట్ట, మెట్టుగూడ, అడ్డగుట్ట తదితర ప్రాంతాలను బంజారాహిల్స్ చేస్తామని ఇచ్చిన హామీ నీటిమూటగా మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఉమర్‌ఖాన్, ఉపాధ్యక్షుడు లతీఫ్, నాయకులు జోగురాములు, హనుమంతు, ఆంజనేయులుగౌడ్, లడ్డు, అంజి, యాదగిరి, శివ, యాకయ్య, ప్రవీణ్, వెంకటేష్, రవి, జోసెఫ్, అలీ, అంజద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల్లో వణుకు

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ ప్రకటించిన ప్రజా మేనిఫెస్టోను చూసి ప్రతిపక్షాల్లో వణుకు మొదలైందని ఆ పార్టీ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో కలిసి కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని బోయిన్‌పల్లి, పెద్ద తోకట్ట, కంసారి బజార్, చింతల్ బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక ధోరణితో ముందుకెళ్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతో నియోజకవర్గ పరిధిలోని వేలాది మందికి డబుల్ బెడ్రూమ్, పట్టాలు వచ్చాయన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కంటోన్మెంట్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని లాస్యనందిత ధీమా వ్యక్తం చేశారు. పాదయాత్రలో బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, బీఆర్‌ఎస్ నాయకురాలు నివేదిత, రామక్రిష్ణ, శ్రీనివాస్, మీనా భాస్కర్, అసిమ్ ఖాన్, ఇర్ఫాన్, నవీన్, పద్మ, ప్రభు గుప్తా పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న లాస్య నందిత

ప్రజాసేవ చేసే అవకాశాన్ని కల్పించండి



కాంగ్రెస్‌లో చేరిన వారితో సంతోష్‌కుమార్

లాలాపేట: మొట్టమొదటిసారి సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి స్థానికుడిగా తనకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఇచ్చిందని, ప్రజలకు సేవ చేసుకునే భాగ్యాన్ని నియోజకవర్గ వాసులు ఇవ్వాలని అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ అభ్యర్థిస్తున్నారు. తార్నాక డివిజన్ పరిధిలోని శాంతినగర్, ఆర్యనగర్, లాలాగూడ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ఆరు హామీలను అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కంతి విజయ్‌కుమార్, అబ్రహం తదితరులు ఆదం సంతోష్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్‌గౌడ్, హరినాథ్, చింతల్ కిట్టు, శ్రీనివాసులు గౌడ్, భరత్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 220 పోలింగ్ బూత్‌లలో ఈవీఎం, వీవీపాట్‌ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో వసతులు వినియోగించుకోవాల్సిన పద్ధతుల పట్ల అవగాహన కల్పించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయక ప్రిసైడింగ్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సికింద్రాబాద్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్.ఎల్లారెడ్డి, సికింద్రాబాద్ ఎన్నికల ప్రత్యేక అధికారి స్వర్ణలత సలహాలు సూచనలు చేశారు. ఈవీఎంలు అమర్చుకోవడం, సీల్ చేయడం, బ్యాటరీల ఏర్పాటు వంటి విషయాల పట్ల సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులతో ఓయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఏర్పాట్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి వారి అభిప్రాయాలు స్వీకరించారు. పోలింగ్ ప్రక్రియ కోసం లష్కర్‌కు చేరిన ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమాల్లో ఎన్నికల అధికారులు కలకర్ణి, హేమలత, పాండునాయక్, భుజేందర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, నాయకులు జలంధర్‌రెడ్డి, రాజ సుందర్, నాగేశ్వర్‌రెడ్డి, నగరపు శ్యామ్ పాల్గొన్నారు.


కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల అధికారులు, రాజకీయ నాయకులు

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా ప్రకాశ్



చిలకలగూడ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా సికింద్రాబాద్ అడిక్‌మెట్‌కు చెందిన సంద్వకర్ ప్రకాశ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు లాల్జీదేశాయ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో పలు పదవులను సమర్ధవంతంగా నిర్వహించిన ప్రకాశ్ పెద్దల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సంద్వకర్ ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ట పర్చి పూర్వ వైభవం తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తనకు పదవీబాధ్యతలు అప్పగించిన ఆల్ ఇండియా, టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షులు లాల్జీదేశాయ్, మిద్దెల జితేందర్, తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ ఇన్‌చార్జి సంగ్రామ్ తవాడేలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి సమస్యలు కనిపించకపోవడం విడ్డూరం


స్థానికులతో మాట్లాడుతున్న సుష్మిత

రసూల్‌పురా: ఐదుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన సాయన్న కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమీ లేదని బీజేపీ సీనియర్ నాయకురాలు సుష్మిత శంకర్రావు ఆరోపించారు. ఏడో వార్డు పరిధిలోని చిన్న కమేలా, ఓల్డ్ డైరీఫామ్ రోడ్డు, లాల్ బజార్, ఎస్‌పీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఆమె పాదయాత్ర చేసి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి ఐదుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగారని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందితకు ప్రజల సమస్యలు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రచారంలో ప్రశాంత్ ప్రభు, ప్రధాన కార్యదర్శి సుధీర్, మంజుల పాల్గొన్నారు.




సత్తా చాటిన ఎన్‌సీసీ కేడేట్లు


ప్రతిభ కనబరిచిన వారిని అభినందిస్తున్న వి.ఎం. రెడ్డి

రసూల్‌పురా: ఎన్‌సీసీ కేడేట్లల్లో జాతీయ సమైక్యత భావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని కలిగించే లక్ష్యంగా జాతీయ స్థాయిలో సైనిక్ క్యాంపులు నిర్వహిస్తామని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ వి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్ర లోనావాలా ఐఎన్ఎస్ శివాజీలో అక్టోబర్ 14 నుంచి 25 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా నౌ (నేవీ) సైనిక్ క్యాంప్–2023లో ప్రతిభ కనబరచిన ఏపీ, తెలంగాణ కేడేట్ల అభినందన కార్యక్రమం సికింద్రాబాద్ టీవోలీ థియేటర్ సమీపంలోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏపీ, తెలంగాణలోని 9 గ్రూపుల నుంచి 24 మంది బాలురు, 12 మంది బాలికల ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్, ఛాంపియన్ షిప్, హెల్త్ అండ్ హైజీన్ పోటీల్లో ట్రోఫీలను కైవసం చేసుకున్నారని బోట్ పుల్లింగ్, బోట్ రిగ్గింగ్, సీమాన్ షిప్, సేమా ఫోర్, షిప్ మోడలింగ్, టెంట్ పిచింగ్, హెల్త్ అండ్ హైజీన్ వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన కేడెట్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందాం

సనత్‌నగర్: దీర్ఘకాలిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని మరోసారి గెలిపించుకుందామని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. బేగంపేట డివిజన్ పరిధిలోని మాతాజీనగర్‌లో శుక్రవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పనులతో కూడిన కరప్రతాలను పంపిణీ చేస్తూ ఆయనను గెలిపించాలని అభ్యర్థించారు. బేగంపేట డివిజన్‌లో 50 ఏళ్ల నాటి ధనియాల గుట్ట శ్మశాన వాటికకు స్థలం కేటాయించటమే కాకుండా అన్ని హంగులు, సకల సదుపాయాలతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అదే విధంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో బేగంపేట ముంపు సమస్యను పరిష్కరించడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, సురేష్ గౌడ్, రాజయ్య, పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రికి ఆసక్తి లేదు



పాదయాత్రలో మహిళలతో మాట్లాడుతున్న కోట నీలిమ

రాంగోపాల్‌పేట్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు నియోజకవర్గ అభివృద్ధిపై ఏ మాత్రం ఆసక్తి లేదని కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ విమర్శించారు. ఇంటింటికి అభయాస్తం పాదయాత్రలో భాగంగా ఆమె కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై మంత్రి పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందుకే ఇంకా మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితిలో ఉందన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల్లో కూడా వివక్ష ప్రదర్శిస్తున్నారని కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షమ పథకాలు అందుతున్నాయన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ పార్టీల నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ ప్రాంతంలో శుక్రవారం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిరంతరం మీ మధ్యే ఉంటూ మీ సాధక బాధలను తెలుసుకొని పరిష్కారించే తమను ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఎన్నికలప్పుడే కనిపించే నాయకులను మాటలను నమ్మితే గోస పడుతారన్నారు. భోలక్‌పూర్ పరిసర ప్రాంతాల్లో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, నాయకులు పవన్‌కుమార్ గౌడ్, ఏసూరి మహేష్, వెంకట్ ముదిరాజ్, మహేందర్, నాగలక్ష్మీ పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సమస్యల పరిష్కారానికి కృషి..

అమీర్‌పేట: దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఎదురొడ్డి పోరాడే సైనికుల్లో అత్యధికులు సిక్కులేనని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం అమీర్‌పేటలోని అతిథి ఇన్ హోటల్‌లో సిక్కు సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా మిలన్ (ఆత్మీయసమావేశం)లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సిక్కు ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ సమస్యల కోసం ఎంతో కృషి చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పూర్తి మద్దతు ఇస్తామన్నారు. తలసాని మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి గెలిచి సీఎం అయిన మర్రి చెన్నారెడ్డి కూడా ఎలాంటి అభివృద్ధి చేయలేక, తర్వాత గెలిచిన ఆయన కుమారుడు అదే బాటలో వెళ్తూ చివరకు ప్రజలకు సైతం అందుబాటులో ఉండేవారు కాదని ఆరోపించారు. తాను ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్న విషయం అందరికి తెలుసన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, గురుద్వారాకు ఆర్చి నిర్మాణం, సిక్కు సమాజ్‌కు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం మూడెకరాల స్థలం, రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

అమీర్‌పేటకు చెందిన మైనార్టీ మోర్చా డివిజన్ అధ్యక్షులు కేవల్‌సింగ్, దౌలత్ సింగ్, మున్నాభాయ్, జాకీ భాయ్‌లతో పాటు మరో 10 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మంత్రి కండువా కప్పి ఆహ్వానించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నట్లు ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగి రోషన్‌సింగ్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, గురుద్వారా అధ్యక్షులు బాగిందర్‌సింగ్, మాజీ మైనార్టీ కమిషన్ సభ్యులు సురేందర్ సింగ్, సుమిత్‌సింగ్, జోగిందర్‌సింగ్ పాల్గొన్నారు.